గ్రహణం వీడేనా!

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం వెరసి రోడ్డు విస్తరణ పనులకు గ్రహణం పట్టింది. ప్రయాణికులకు శాపంగా మారింది. టీడీఆర్‌లు చెల్లించక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. అయినా పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఫలితంగా వేలాది మంది వాహన చోదకులు నిత్యం అవస్థలకు గురవుతున్నారు. ఇంకెన్నాళ్లీ కష్టాలంటూ స్థానికులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- టీడీఆర్ చెల్లింపులో అలసత్వం
- ముందుకు సాగని రోడ్డు విస్తరణ పనులు
- కూర్మన్నపాలెం– రాజీవ్‌నగర్ రహదారి ప్రయాణికులకు తప్పని తిప్పలు



పనులు నిలిచిపోవడంతో బురదమయంగా వీధిరోడ్డు



అసంపూర్తిగా డ్రైనేజీ



పాత కొత్త డ్రై నేజీ మధ్య మట్టిపోగులు, రాళ్లకుప్పలు

అగనంపూడి: కూర్మన్నపాలెం జాతీయ రహదారి కూడలి నుంచి రాజీవ్‌నగర్ వరకు రహదారిని 100 అడుగులకు విస్తరించాలని 2019 ఫిబ్రవరిలో బ్లూ ప్రింట్ సిద్ధం చేశారు. ఆ మేరకు 2020లోనే విస్తరణ పనులు ప్రారంభించి, నిర్మాణానికి అడ్డంగా ఉన్న కట్టడాలను తొలగించారు. కరోనా వల్ల పనులు ముందుకు సాగలేదు. తిరిగి 2023 ఆగస్టు నుంచి రహదారి విస్తరణ పనులు ప్రారంభించి రోడ్డుకిరువైపులా డ్రైనేజీలు నిర్మించారు.

పనుల విభజన ఇలా..

రూ.11.39 కోట్లతో విస్తరణ పనులను మూడు భాగాలుగా విభజించి టెండర్లు ఖరారు చేశారు. డ్రైనేజీలు నిర్మాణం, రోడ్డు నిర్మాణం, ఫుట్‌పాత్‌ల నిర్మాణ పనులు ప్రారంభించారు. డ్రైనేజీ నిర్మాణ పనులు 90 శాతం పూర్తి కాగా, ఐదు మాసాల నుంచి రహదారి విస్తరణ పనులు గాలికి వదిలేశారు. పాత డ్రైనేజీలను పూడ్చి, శిథిలాలను తొలగించి కొత్త డివైడర్లు ఏర్పాటు చేసి రహదారులు నిర్మించాల్సి ఉంది.

ఐదు మాసాలుగా ఎక్కడి పనులు అక్కడే వదిలేయడంతో నిత్యం వేలాది మంది ప్రయాణికులు, స్థానికులు అగచాట్లకు గురవుతున్నారు. సినిమాహాలు నుంచి సైమన్‌నగర్ వరకు కిలోమీటన్నర వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. పాత డ్రైనేజీలు తొలగించకపోవడం వల్ల రోడ్డు ఇరుగ్గా మారడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది. మట్టి పోగులు పేరుకుపోయాయి. మరికొన్ని చోట్ల పాత రోడ్డు అంచుల వద్ద గోతులు ఉండడంతో ఈ ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.



పనులకు అడ్డంకిగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

సగం మందికే టీడీఆర్

రహదారి విస్తరణలో సుమారు 118 మంది స్థలాలు కోల్పోయారు. వీరిలో సగం కంటే తక్కువ మందికి (52 మందికి) టీడీఆర్ (అభివృద్ధి హక్కుల బదిలీ పత్రం) అందివ్వగా, ఇంకా 66 మందికి ఇవ్వాల్సి ఉంది. మిగతావారికి గత ఫిబ్రవరిలో మంజూరు చేయడానికి నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. కూర్మన్నపాలెం కూడలి నుంచి రాజీవ్‌నగర్ వైపు వచ్చేటప్పుడు కుడివైపున ఉన్న 35 మందికి, ఎడవ వైపున ఉన్న 31 మందికి మొత్తం 66 మందికి టీడీఆర్ అందించాల్సి ఉంది. అలాగే కొంతమంది నిర్మాణాలకు కూడా నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. స్థల యజమానులకు టీడీఆర్‌లు చెల్లిస్తే తప్పా పనులు ముందుకు సాగే పరిస్థితి కనపడడం లేదు. తక్షణమే పాలకులు పట్టించుకొని పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు తీరేదెన్నడో...



మాకు రోడ్డు కష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియడం లేదు. అసంపూర్తి పనుల వల్ల డబుల్ రోడ్డు పక్కల్లో మట్టిపోగులు, చెత్త, మధ్యలో చెట్లు పేరుకుపోయాయి. పాత డ్రై నేజీల శిథిలాలు కూడా ఇబ్బందికరంగా మారాయి. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రహదారి విస్తరణ పనులు సత్వరం పూర్తి చేసి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలి.

– కె.ఈశ్వర్, వుడా ఫేజ్–1 కాలనీ ప్రతినిధి

టీడీఆర్‌ల మంజూరులో జాప్యం తగదు



టీడీఆర్‌లు అందివ్వడంలో జాప్యం కారణంగా పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో స్థానికులు అగచాట్లు పడుతున్నారు. సగం మందికి మాత్రమే టీడీఆర్‌లు అందించారు. ఏడాది నుంచి కాలయాపన చేస్తున్నారు తప్పా టీడీఆర్‌లు అందించేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఇటువంటి మార్గంలో ఇలా పనులు చేపట్టకుండా మధ్యలో వదిలేయడం తగదు.

– వాడపల్లి రామచంద్రరాజు, కూర్మన్నపాలెం

ప్రక్రియ ముందుకు సాగేలా కృషి



టీడీఆర్‌లు మంజూరు చేయాలంటే ముందుగా నోటిఫికేషన్ జారీ చేయాలి. తర్వాత టీడీఆర్ అర్హుల పేరుతో జాబితాలు రూపొందించడం జరుగుతుంది. టీడీఆర్‌ల అందిస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుంది. త్వరలో టీడీఆర్‌లు అందించే ప్రక్రియ జరుగుతుంది. దీని కోసం కృషి చేస్తాను.

– లేళ్ల కోటేశ్వరరావు, కార్పొరేటర్

పత్రీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న వంశీ కిరణ్

ఉక్కునగరం: పత్రీజీ ఆశయమైన ధ్యాన జగత్, శాకాహార జగత్, పిరమిడ్ జగత్‌కు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని బోధకుడు వంశీ కిరణ్ పిలుపునిచ్చారు. అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కునగరం నెహ్రూ పార్కులో జరిగిన కార్యక్రమంలో వంశీ కిరణ్ ప్రసంగించారు. ధ్యానం ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని పత్రీజీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. జబర్దస్త్ ఆర్టిస్ట్ సత్తిపండు మాట్లాడుతూ ధ్యానం ఎంతో గొప్పదన్నారు. ధ్యానం, కోలాటం, ఆటలు, పాటలతో కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. మీసాల గణేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీనియర్ మాస్టర్స్ పద్మావతి, భానుమతి, కట్టా పద్మ, జయలక్ష్మి, లక్ష్మీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో శ్రమదానం



శ్మశానవాటికను శుభ్రం చేస్తున్న నాయకులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు బాపూజీ కాలనీలోని శ్మశాన వాటికలో స్థానికులు, జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది, వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు శ్రమదానం చేశారు. దహన సంస్కారాలు చేసేందుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. శ్మశాన వాటికలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. తుప్పలను తొలగించి పరిశుభ్రంగా తయారు చేశారు.

క్లుప్తంగా

నమో వేంకటేశాయ



పుష్పాలంకరణలో వెంకన్న

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల బాలాజీకి సహస్ర నామార్చన అనంతరం శ్రీదేవి, భూదేవి సహిత తిరుమలేశునికి విశేష పుష్పాలతో అలంకరించి భక్తులు దర్శన భాగ్యం కల్పించారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



జట్టును పరిచయం చేసుకుంటున్న భెల్ హెచ్‌ఆర్ మేనేజర్ పంకజ్

అక్కిరెడ్డిపాలెం: రాష్ట్ర స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌ను భెల్ (హెచ్‌పీవీపీ) క్రీడా మైదానంలో ఆదివారం సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ పంకజ్ ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల నుంచి 10 టీంలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధానకార్యదర్శి, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు ఉరుకూటి బాబూరావు, వారాడ ఆనంద రావు, బీహెచ్‌పీవీ నేషనల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు చిమ్మిటి మురళీశ్వర రావు, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్వే వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తాం



మల్లమ్మపేరంటాలు ఆలయం వద్ద సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: మింది రాంనగర్ వైపు స్థలాలను విశాఖ డెయిరీ ఆక్రమించిందంటూ అందిన ఫిర్యాదు మేరకు ఆదివారం రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. అక్కిరెడ్డిపాలెం శివారు మల్లమ్మ పేరంటాలు ఆలయం వద్ద స్థలాన్ని గ్రామంలో కొందరు నాయకులు చూపించగా ఆ ప్రాంతంలో సర్వే చేపట్టారు. సర్వే వివరాలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సిబ్బంది తెలిపారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

పెదగంట్యాడ: ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జీవీఎంసీ 76వ వార్డు పరిధి హౌసింగ్‌బోర్డు కాలనీ వాసవీ సంచయతన దేవాలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా కొత్తా సూర్యనారాయణ, కార్యదర్శిగా తీగెల శ్రీనివాసరావు, కోశాధికారిగా నాగమల్ల ప్రభోజీతో పాటు మరో 18 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సంఘం పెద్దలు మెగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడి శెట్టి ముత్యాల శెట్టి,కొల్లా అప్పలరాజు నూతన కార్యవర్గ సభ్యులతో వాసవీమాత సన్నిధిలో ప్రమాణం చేయించారు.

ఉత్సాహంగా తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ కలయిక



డీజీఎం వేణుగోపాల్ దంపతులను సత్కరిస్తున్న తెలంగాణ సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్వర్ణ జయంతి పార్కులో ఆదివారం నిర్వహించిన తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా జరిగింది. తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళలు, పిల్లలు ఆట, పాటలతో సందడి చేశారు. స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ ఎస్. వీరేశం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ విధి నిర్వహణలో అలసిపోయిన ఉద్యోగులకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ఉక్కు డీజీఎం కె. వేణుగోపాల్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధానకార్యదర్శి జి. ఆనంద్, ప్రతినిధులు బి. వెంకటేశ్వర్లు, టి. ప్రభాకర్, ఎస్. నర్సింగరావు, జె. శ్రవణ్‌కుమార్, సీహెచ్. రవికుమార్, ఎం. చంద్రశేఖర్, మోతుకూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

అక్కిరెడ్డిపాలెం: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గాజువాక పోలీసులు పట్టుకున్నారు. గాజువాక సీఐ ఎ.పార్థసారథి ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మల్కాపురానికి చెందిన అచ్చిబాబు అనే వ్యక్తి వ్యానులో సుమారు రెండు టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని సబ్బవరం తరలిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులు గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. వ్యాను మింది గ్రామం నుంచి వెళ్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాధాకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేసి వ్యానుతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

క్రికెట్ అకాడమీకి స్థల కేటాయింపునకు కృషి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

గాజువాక: గాజువాకలో క్రికెట్ అకాడమీకి స్థలం కేటాయించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక సీనియర్ క్రికెటర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవంలో భాగంగా స్థానిక జింక్ మైదానంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వివేక్, వేణుగోపాల్, శ్రీకాంత్‌వంటి ఉద్ధండులు జింక్ గ్రౌండ్‌లోనే సాధన చేశారన్నారు. వాళ్ల స్ఫూర్తితో ఈ ప్రాంతానికి చెందినవారు దేశ క్రికెట్‌లో రాణించడానికి కృషి చేయాలన్నారు. పేద క్రికెట్ క్రీడాకారులకు గాజువాక సీనియర్ క్రికెట్ అసోసియేషన్ అందిస్తున్న సేవలను కొనియాడారు. వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ జింక్ గ్రౌండ్‌లో సాధన చేసిన ఎంతో మంది క్రీడాకారులు దేశ స్థాయిలో రాణించడం ఆనందదాయకమన్నారు. యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి నూకరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, గంధం వెంకటరావు, దీనంకొండ కృష్ణంరాజు, అసోసియేషన్ ప్రతినిధులు రాజారావు, సి.పి.రెడ్డి, సీనియర్ కోచ్ గాంధీ, కసిరెడ్డి రమణ, అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

ముం'చెత్తే'గా..

ఏ వార్డులో చూసినా ఏముంది.. !

చెత్త కుప్పలు.. పూడుకుపోయిన డ్రైనేజీలు.. వాటిపై పందుల స్వైర విహారం ఇది పెదగంట్యాడ మండలంలోని ఏ ప్రధాన కూడలిలో చూసినా కనిపించే దృశ్యం.

ప్రజా ఆరోగ్య శాఖ సిబ్బంది పర్యవేక్షణ లోపం వల్ల మండలంలో ఏ ప్రాంతానికి వెళ్లినా చెత్తా చెదారాలు దర్శనమిస్తున్నాయి. మినీ డంపింగ్ యార్డులుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నాయి. జీవీఎంసీ 73వ వార్డు వుడా కాలనీ ప్రధాన రహదారి, 76వ వార్డు నడుపూరు ప్రధాన రహదారి, 64వ వార్డు యాతపాలెం ప్రధాన రహదారి. 74వ వార్డు హనుమాన్ మందిరం ఎదురుగా, 75వ వార్డు కోరాడ ఆలయాల వద్ద, 65వ వార్డు భవానీ నగర్ ప్రధాన రహదారుల్లో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు పందులు తిష్టవేయడంతో మురికివాడలను తలపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎక్కడా చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పెదగంట్యాడ



మినీ డంపింగ్ యార్డును తలపిస్తున్న వుడా కాలనీ ప్రధాన రహదారి



75వ వార్డు కోరాడ ప్రధాన రహదారిలో చెత్త కుప్ప



76వ వార్డు నడుపూరు ప్రధాన రహదారిలో పందుల స్వైర విహారం



భవానీ నగర్‌లో..



యాతపాలెం ప్రధాన రహదారిలో..

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో స్వచ్ఛ భారత్



ఒకటో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పరిసరాలు శుభ్రం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ప్రజాసంఘాల ప్రతినిధులు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్ ఫారం వైపు ప్రజా సంఘాలు ఆదివారం ఐక్యంగా స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టాయి. వీఐపీ లాంజ్, పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. స్పందన చేయూత ఫౌండేషన్, దువ్వాడ రైల్వేస్టేషన్ యూజర్స్ అసోసియేషన్, మానవతా చారిటబుల్ ట్రస్ట్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు స్టేషన్ ఆవరణను పరిశుభ్రం చేసి ప్రయాణికులతో శభాష్ అనిపించుకున్నారు. కార్యక్రమంలో రైల్వేజోన్ యూజర్స్ కన్సల్టెన్సీ కమిటీ ప్రతినిధి కంచుమూర్తి ఈశ్వర్, కమర్షియల్ విభాగం అధికారి ఎం.ఎస్.రావు, ప్రజాసంఘాల నాయకులు సీతారామరాజు, ఎంఎస్ఎన్‌మూర్తి, నషీనా, కె.రాజేశ్వరరావు, కె.సాంబశివరావు, రాంబాబు, కామేశ్వరరావు,ప్రసాదరావు, కె.వి.సుబ్బరాజు, రవికుమార్, జలంధర్, ఎస్ఎస్‌రావు పాల్గొన్నారు.

సందడే.. సందడి



యారాడ తీరంలో సందడి చేస్తున్న ఈస్టర్న్ నేవల్ కమాండ్ శెట్టిబలిజ ఎంప్లాయిస్ యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

పెదగంట్యాడ: వారంతా నేవల్ డాక్‌యార్డ్‌లో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. ఒకే కులానికి చెందిన వారు.. అంతా ఒక్కసారి కలవాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆదివారం యారాడ తీరంలో కలిసి సందడి చేశారు.. రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. ఆట పాటలతో హోరెత్తించారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు దొమ్మేటి అప్పారావు, టి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి రాయుడు రవి, కోశాధికారి సీహెచ్ సత్తిబాబు, కార్యదర్శులు రమేష్, శ్రీను, లక్ష్మణ్, జి.వెంకటేష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గెడ్డలోంచి తీసి.. రోడ్డుపై పోసి!



కొత్త కర్ణవానిపాలెం గెడ్డ నుంచి తీసి రోడ్డుపై వేసిన డెబ్రిస్

పెదగంట్యాడ: అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది ఈ చిత్రం. ఈ ఫొటోలో కనిపిస్తున్న డెబ్రిస్ కొత్త కర్ణవానిపాలెం వద్ద గెడ్డలోంచి తీసింది. వారం గడుస్తున్నా రోడ్డుపై వదిలేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువైందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాన్ని తొలగించాలని కోరుతున్నారు.

భెల్‌లో ఘనంగా ఐక్య క్రిస్మస్



మాట్లాడుతున్న భెల్ డీజీఎం లీల

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ)లో ఆదివారం రాత్రి భెల్ ఐక్య క్రిస్మస్ ఈవ్ – 2024 వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళా భారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ డీజీఎం (హెచ్ఆర్) ఎస్.లీల మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకలను ఉత్సాహంగా చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భెల్ సంఘం అధ్యక్షుడు టి.జానేష్, కార్యదర్శి ఎన్.జాన్ రాజు, ప్రతినిధులు బిషప్ ఆనంద్ కె.ధన్యు, పి.సుధాకర్ బాబు, డాక్టర్ జాకబ్ ఏ.ఎస్.కుమార్, ఈ.శ్యామ్యూల్, వైజ్ఞానలత, జి.స్వామినాథమ్, ఎస్.జె.సి.బాబు, ఎల్.జీవన్ దాస్ పాల్గొన్నారు.

రోడ్లు ఇలా.. రాకపోకలెలా?



వుడా ఫేజ్–1 కాలనీలో శిథిలమైన రహదారి

అగనంపూడి: జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ వుడా ఫేజ్–1 కాలనీలో రహదారులు శిథిలమయ్యాయి. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఎల్ఐజీ 68 నుంచి ప్రారంభమయ్యే వీధిలో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రహదారులను పునర్నిర్మించాలని కాలనీ అసోసియేషన్ రెండు మాసాల కిందట ఫిర్యాదు చేసినా కనీసం మరమ్మతులు చేపట్టాలని కూడా అధికారులు ముందుకు రాకపోవడంపై కాలనీవాసులు మండిపడుతున్నారు. జీవీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యే స్పందించి శిథిల రహదారులను పునర్నిర్మించాలని కోరుతున్నారు.